క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన

ప్రొద్దుటూరు : మండలంలోని చౌటపల్లె గ్రామంలో శనివారం ఎస్సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎయిడ్స్, ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మన చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ స్పెషల్ క్యాంప్ ఈనెల 31వ తేదీ వరకు నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏసీ వెంకటరాముడు పేర్కొన్నారు.

రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక

చాపాడు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని జార్జ్ క్లబ్‌లో జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో అండర్–14 విభాగంలో మండలంలోని అయ్యవారిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు రమణ తెలిపారు. బాలికల విభాగంలో 7వ తరగతి చదువుతున్న నమిరూన్ బీ, బాలుర విభాగంలో 8వ తరగతి చదువుతున్న గోవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నెల 28న జరుగనున్న రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు వీవీ శివారెడ్డి తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం : మండలంలో రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి కోరారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరైయ్యారు. ముందుగా ఎంపీపీ మాట్లాడుతూ నిరుపేదలకు సంక్షేమ పథకాలు బాగా అందుతున్నాయి. రెవెన్యూ సమస్యలను ఇక్కడ తీర్చలేక పోతున్నామన్నారు. సమస్యలను జిల్లా స్థాయి అధికారులకు పంపడం, ముఖ్యంగా జెడ్పీ సమావేశాలలో కూడా జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి కలెక్టర్ దృష్టికి ఎన్నోసార్లు తీసుకుపోయినట్లు గుర్తు చేశారు. అయినా ఫలితం లేదన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వారం, పదిరోజుల్లో బి.మఠంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేయించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే నరసన్నపల్లె, మలుగుడుపాడు గ్రామాలలోని నిరుపేదలకు 2006లో ఇచ్చిన పట్టాలకు సర్వే చేయించి పట్టాదారులకు తక్షణం భూములు చూపాలని బద్వేల్ ఆర్డీఓకు ఫోన్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, పీఆర్ డీఈఈ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

42 మద్యం బాటిళ్లు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామంలో కమ్మసాబ్‌గారి మహబూబ్ బాషా అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో ఆవ్యక్తి పట్టుకున్నట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ శనివారం తెలిపారు. ఆవ్యక్తి వద్ద నుంచి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఆలయ కమిటీ ఎన్నిక

పోరుమామిళ్ల : పట్టణంలోని రెడ్డినగర్ శ్రీకోదండ రామస్వామి దేవాలయం అధ్యక్షుడిగా చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇండ్లశ్రీరాములురెడ్డి, కార్యదర్శిగా కాకర్లబాలుడు, కోశాధికారిగా బోయిళ్లఓబుల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి శ్రీకోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడు చాపాటిలక్ష్మీనారాయణరెడ్డి, మాజీ అధ్యక్షుడు పాలకొలనురామసుబ్బారెడ్డి, కమిటీ కార్యవర్గంను సన్మానించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

బి.కోడూరు : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఆర్‌హెచ్‌ఆర్‌సీ ట్రస్టు నిర్వాహకులు గంట రామమోహన్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కాసా నగరం వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్‌హెచ్‌ఆర్‌సీ ట్రస్టు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంటర్మీడియెట్, పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాయలకుంట్ల పంచాయతీ సెక్రటరీ మాబురెడ్డి, పాఠశాల స్పెషలాఫీసర్ శ్రీలక్ష్మి, ఎస్ఆర్‌హెచ్‌ఆర్‌సీ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చింతకుంట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు తనిఖీ చేశారు. శిబిరాన్ని సర్పంచ్ కోగటం వీరారెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరానికి వచ్చిన 430 మందికి డాక్టర్లు రోషిణి, శ్రీలలిత, నాగయ్య, సురేష్‌బాబు, చంద్రమౌళి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణ చేశారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను అందించారు.

మాట నిలబెట్టుకున్నాం


4 సెంట్ల స్థలానికి సంబంధించిన పత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : నియోజకవర్గంలోని 50 వేల మంది మహిళల డ్వాక్రా రుణాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేసి మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరాములపేటలోని కాన్పుల ఆస్పత్రి వద్ద శనివారం వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన ప్రకారం నాలుగు దఫాల్లో డ్వాక్రా రుణాలన్నింటినీ వడ్డీతో సహా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చేశారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి మాట్లాడుతూ పథకాలన్నీ ఇప్పటిమాదిరే సజావుగా అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, మహిళా అధ్యక్షురాలు కోనేటి సునంద, కౌన్సిలర్లు నాగేంద్రారెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్వీఓ హోంలో శనివారం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కృపా డెవలప్‌మెంట్ సొసైటీ తరపున ఎస్సీ ట్రైనింగ్ స్కీం కింద మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

ధర్మం పక్షాన ఉంటే విజయం తథ్యం

ధర్మం పక్షాన ఉంటే విజయం తథ్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డులోని కెఎంహెచ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఓం శాంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూబి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి చేయూత

ఎలక్ట్రికల్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్న వెంకటసుబ్బయ్య ఇటీవల మృతి చెందాడు. తర్వాత కొద్ది రోజులకు అతని భార్య కూడా మృతి చెందింది. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు స్పందిస్తూ.. పిల్లల పోషణ బాధ్యతలను తీసుకుంటున్నట్లు తెలిపారు. వారి ఇద్దరు కుమార్తెలు, కుమారుడుకి అండగా ఉంటూ వారి చదువు, ఉద్యోగం, పెళ్లిళ్లు చేస్తానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి రూ. 50 వేలు, ఎంపీపీ శేఖర్ యాదవ్ రూ. 25 వేలు వెంకటసుబ్బయ్య పిల్లలకు అందచేశారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ప్రొద్దుటూరు : త్వరలో జరగబోయే ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం స్థానిక శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో 'సిద్ధం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని కార్యకర్తలు, నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేక టీడీపీ, జనసేన, కమ్యూనిస్టులతో సైతం కలసి వస్తున్నారన్నారు. ఎంతమంది కలసి వచ్చినా ఈ ఎన్నికల్లో తప్పక మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పూర్తి నమ్మకం ఉందన్నారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిద్ధం పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

రూ.10.57 కోట్లు వైఎస్సార్ ఆసరా మంజూరు

ప్రొద్దుటూరు మండల పరిధిలోని 1584 డ్వాక్రా గ్రూపులకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.10,57,01,756 మంజూరైనట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దొరసానిపల్లె, చౌటపల్లె గ్రామాలకు సంబంధించి శనివారం సాయంత్రం దొరసానిపల్లె గ్రామ సచివాలయం వద్ద సమావేశం నిర్వహించారు.

4 సెంట్ల స్థలం వితరణ

ప్రొద్దుటూరు క్రైం : తన వద్దకు వచ్చిన ప్రతి వ్యక్తికి, వర్గానికీ సాయం చేశానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెన్నంరాజుపల్లె రహదారిలో ఎలక్ట్రికల్ అసోసియేషన్ భవనం కోసం ఎమ్మెల్యే రూ. 20 లక్షలు విలువ చేసే 4 సెంట్ల సొంత స్థలాన్ని ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎలక్ట్రికల్ ఆఫీస్ అసోసియేషన్ బిల్డింగ్ కోసం 3 సెంట్ల స్థలం కావాలని అసోసియేషన్ సభ్యులు తనను అడిగారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 20 లక్షలు విలువ చేసే 4 సెంట్ల పట్టా స్థలాన్ని వారికి ఇస్తున్నానని చెప్పారు. ఇటీవలే ఫోటోగ్రాఫర్లు, భవన నిర్మాణ కార్మికులకు, ఉప్పర కులస్తుల కల్యాణమండం కోసం సొంత స్థలాలను ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై కూడా టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఇతరులకు సహాయం చేయని టీడీపీ నాయకులు అబద్ధాలు మాట్లాడుతూ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం నాలుగు సెంట్ల స్థలానికి సంబంధించిన పత్రాలను అసోసియేషన్ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు.

సీఎం వైఎస్ జగన్ మహిళల పక్షపాతి

- ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అన్నీ పూర్తి
- డ్వాక్రా మహిళల కళ్లలో ఆనందమే ఇందుకు నిదర్శనం
- మహిళలే వైఎస్సార్‌సీపీకి బలం
- ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి


ఆర్‌బీకే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళల పక్షపాతి. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందని ఎమ్మెల్యే ఎస్ .రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం బ్రహ్మంగారిమఠంలో యోగి వేమారెడ్ల అన్నదాన కళ్యాణ మండపంలో నాల్గువ విడత వైఎస్సార్ ఆసరా నిధుల సభ నిర్వహించారు. మండలంలోని దాదాపు 3 వేలమంది సంఘం సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీ సక్రమంగా అమలు పరచలేదన్నారు. వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను అమలు పరచడంతో మహిళలు ఆనందరంలో ఉన్నారు. ఈరోజు ఇంతమంది మహిళలు ఆసరా సమావేశానికి వచ్చారంటే వారికి జగన్‌పై ఎంత నమ్మకం ఉందో అర్థమవుతుందన్నారు. ప్రతి నిరుపేద మహిళ ఉన్నతి స్థితిలో ఉండాలనేది ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మహిళలే బలం అన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలో 475 సంఘాలు ఉండగా వారికి నాల్గు దపాలు రూ 12.10 కోట్లు ఆసరా కింద రుణం ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ ఐదు ఏళ్ల కాలంలో రెండు ఏళ్లు కరోనా వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రం తప్పకుండా మన ముఖ్య మంత్రి అమలు పరచారన్నారు. వచ్చే ఎన్నికల్లో హామీలను అమలుపరచిన జగన్ కావాలా లేక ఇచ్చిన హామీలను అమలు పరచని చంద్రబాబు కావాలా అనేది మహిళలే నిర్ణయించుకోవాలన్నారు. ఎంపీపీ సి వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడం ఒక జగన్‌కే సాధ్యమన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాల గురించి మహిళలకు వివరించారు. జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి మాట్లాడుతూ మన పెద్దాయన శెట్టిపల్లె రఘురామిరెడ్డి అత్యధిక మెజార్టీతో మహిళలు మరో మారు గెలిపించుకోవాలన్నారు. ప్రతి నిరుపేద ఇంట్లో ప్రభుత్వ పథకం లబ్ధి చేకూరిందన్నారు. పీడీ ఆనందనాయక్, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి , ఏపీఎం ప్రకాశం, ఈసీలు, డ్వాక్రా సంఘం సభ్యులు శోభారాణీ, మేరమ్మ మాట్లాడారు. సమావేశం అనంతరం సీఎం చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బి.మఠం సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్న కుమార్ యాదవ్,స ర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

ఖాజీపేట : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీయం జగన్ చేస్తున్న కృషి అభినందనీయం అని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం మిడుతూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భోరోసా కేంద్రం, అంగన్ వాడీ కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రాంభించారు. అనంతరం మిడుతూరు గ్రామంలో 146 మంది పేద దళితులకు జగనన్న భూ సంరక్షణ పథకం కింద టైటిల్ డీడ్‌లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో డీకేటీ పట్టాలు పొందిన వారికి ఎలాంటి రుణాలు పొందే అవకాశం లేకుండా ఉండేదన్నారు. రిజిస్ట్రేషన్ జరిగేది కాదన్నారు. వాటిని మార్పించి నేడు ఆ భూములకు సర్వహక్కులను కల్పిస్తూ పట్టాలను అందించామన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, ర్పంచ్ తప్పెట మేరీ, ఎంపీటీసీ ప్రశాంతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, జింకా ప్రసాద్, అచ్చనపల్లె చిన్న సుబ్బారెడ్డి, వల్లూరు మురళీధర్‌రెడ్డి, పోలు సుబ్బరాయుడు, చిత్రాల జనార్ధన్, లక్ష్మయ్య, వనిపెంట రామసుబ్బారెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

బ్రహ్మంగారిమఠం : మండలంలో మల్లేపల్లె, ముడుమాల, సోమిరెడ్డిపల్లె , డి.నేలటూరు, నాగిశెట్టిపల్లె, రేకలకుంట పంచాయతీలలో ఆదివారం ఆర్‌బీకే భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఎంపీపీ వీర నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- అట్లూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా


లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే


కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలు

అట్లూరు : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, వారి ముఖంలో చిరునవ్వులు చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని స్త్రీశక్తి భవనం ఆవరణలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ బి.వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను.. అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇది వరకే మూడు విడతలుగా జమ చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు మిగిలిన నాల్గవ విడత కింద అట్లూరు మండల పరిధిలో 400 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రూ.2.65 కోట్లు మాఫీ చేయడం జరిగిందన్నారు. మొత్తం అట్లూరు మండల పరిధిలో నాలుగు విడతలుగా రూ.10.60 కోట్లు మాఫీ చేయడం జరిగిందన్నారు. బద్వేలు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి అట్లూరు మండల ప్రజలు మెజార్టీ ఇవ్వడం జరుగుతోందన్నారు. అలాగే త్వరలో జరగనున్న ఎన్నికలలో అత్యధిక మెజార్టీ ఇచ్చి మన బద్వేలు నియోజక వర్గ అభిమానాన్ని చాటుకుందామని పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చిన సీఎం జగన్

ఎమ్మెల్యే డాక్టర్ సుధా మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలలో 65 శాతం మహిళలకే అందిస్తున్నారన్నారు. అనంతరం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంటు సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 660 హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి అయ్యాక ఆయన చేసింది శూన్యమన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కావున రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, అటవీవాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజోలు సుబ్బారెడ్డి, అట్లూరు, కుంభగిరి, కామసముద్రం, వరికుంట సర్పంచులు యల్లమ్మ, గంగమ్మ, ఆర్వీ సుబ్బారెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు

బద్వేలు అర్బన్ : అద్దె భవనాల్లో కొనసాగుతున్న, శిథిలావస్థకు చేరుకున్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని సబ్‌జైలు సమీపంలో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 9 ఏళ్ళ కిందట నిర్మితమై అసంపూర్తిగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయ భవనానికి నిధులు సమీకరించుకుని భవనాన్ని పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, ఎంపీపీ బిజివేముల రమణమ్మ, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి రామసుబ్బారెడ్డి, పెద్దపోలిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఆర్ డీఈ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ ఆసరా సంబరాలు

గోపవరం : వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధుల విడుదలకు సంబంధించి సోమవారం రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో సంబరాలను జరుపుకోనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ

కలసపాడు : కలసపాడులో డీఎంఎఫ్ నిధులు రూ.28 లక్షల వ్యయంతో నిర్మించే డ్రైనేజీ పనులకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం భూమిపూజ చేశారు. గతంలో వర్షం పడినప్పుడు నీరు పోయేందుకు డ్రైనేజీలు లేక ఇళ్లలోకి, రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. ప్రస్తుతం డ్రైనేజీ పనులు పూర్తయితే ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురి విరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, పులివీరారెడ్డి, రాంబాబు, షరీఫ్ పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చేందుకు కృషి

బద్వేలు అర్బన్ : గత నెలలో కురిసిన అకాల వర్షాలకు మండల పరిధిలోని ఆయా పంచాయతీల్లో పంట నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్, అధికారులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు స్పందన

గోపవరం : రాచాయపేట సచివాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నలుగురు వైద్యులు శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య బృందం మురళీకృష్ణ, చరణ్‌కుమార్‌రెడ్డి, సుప్రియ, వినోద్, ఆరోగ్య సిబ్బంది పీహెచ్ఓ గౌస్, మల్లీశ్వరమ్మ, శివనాగరాజు, శివగణేష్, సర్పంచ్ నాగేంద్ర, పంచాయతీ సెక్రటరీ నిఖిత పాల్గొన్నారు.

బి.కోడూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం పెద్దుళ్ళపల్లెలో ఎంపీడీఓ భాస్కర్ రావు, వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. 300 మందికి పరీక్షలు చేశారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

మైదుకూరు : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో శనివారం మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్నందున మండలంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్లు, తాగునీటి పథకాల పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, పంచాయతీ రాజ్ ఏఈ మధుసూదన్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి, హౌసింగ్ డీఈఈ పాండురంగారెడ్డి, ఉపాధి ఏపీఓ రామచంద్రారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య, ఉద్యాన అధికారి రామకృష్ణ తదితరులు ఆయా శాఖల అభివృద్ధిపై సమావేశంలో నివేదికను అందజేశారు. సమావేశంలో ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీలు ఊటుకూరు రఘురామిరెడ్డి, చిన్న కొండమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఖాన్, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ కమిటీ కార్యాలయం ఏర్పాటు

మైదుకూరు : మైదుకూరులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం పని చేస్తున్న మాలలు, మాల మహానాడు నాయకులు శనివారం అంబేడ్కర్ కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కడప రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాయల కూడలి మీదుగా మార్కెట్ సర్కిల్ వరకు మాలలు, మాలమహానాడు నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కమిటీ కార్యాలయాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.సురేష్ కుమార్ ప్రారంభించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దువ్వూరు : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజామైనుద్దీన్ పేర్కొన్నారు. చింతకుంట పంచాయతీ రామాపురంలో శనివారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరికీ చట్టాలు ఉంటాయని, వాటిని అవగాహన చేసుకోవాలని తెలిపారు. 18 ఏళ్లు నిండక ముందే ఆడ పిల్లలకు వివాహం చేయడం నేరమన్నారు. మహిళలపై వివక్ష చూపకూడదని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు, ఎస్ఐ శ్రీనివాసులు వివిధ చట్టాల గురించి వివరించారు. సర్పంచ్ కోగటం వీరారెడ్డి, ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఆలీఖాన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, అడ్వకేట్స్ శివరామకృష్ణ, శ్రీనివాసులు, నాగిరెడ్డి, చారి, రమణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

ముగిసిన నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

బద్వేలు అర్బన్ : జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి నియోజకవర్గానికి పేరు తీసుకురావాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ క్రీడాంశాల్లో నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన జట్లకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బహుమతులు అందజేశారు. ఇందులో భాగంగా క్రికెట్ పురుషుల విభాగంలో నియోజకవర్గ స్థాయిలో బద్వేలు జట్టు విన్నర్స్‌గా నిలవగా, కలసపాడు జట్టు రన్నర్స్‌గా నిలిచింది. మహిళల విభాగంలో అట్లూరు జట్టు విన్నర్స్‌గా, గోపవరం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో బద్వేలు, ద్వితీయ స్థానంలో పోరుమామిళ్ళ, తృతీయ స్థానంలో అట్లూరు జట్లు నిలువగా.. మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో గోపవరం, ద్వితీయ స్థానంలో బద్వేలు, తృతీయ స్థానంలో అట్లూరు జట్లు నిలిచాయి. కబడ్డీ పురుషుల విభాగంలో బద్వేలు అర్బన్ మొదటి స్థానంలో, కాశినాయన ద్వితీయ స్థానంలో, పోరుమామిళ్ళ జట్లు తృతీయ స్థానంలో నిలువగా.. మహిళల విభాగంలో బద్వేలు మొదటి స్థానం, బి.కోడూరు ద్వితీయ స్థానం, గోపవరం జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ఇంకా పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. విజేతలకు మెడల్స్‌తోపాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కేశవరెడ్డి, మున్సిపాలిటీ వార్డు ఇన్‌చార్జిలు బిజ్జంరమణ, చెన్నకృష్ణారెడ్డి, రమేష్‌బాబు, బి.కోడూరు మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, గోపవరం మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మున్సిపల్ డీఈ సుమన్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు విజయకుమార్, వీరశేఖర్‌రెడ్డి, పీఈటీలు బాలయ్య, రమేష్‌యాదవ్, సుబ్బారావు, ప్రభాకర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.